




# కరపత్రం

SINCE 2014

శనివారం మే 02, 2026 | సంపుటి : 2 | సంచిక : 201 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4




## ఆర్టీసీ కార్మికుల సమ్మెకాలానికి జీతం

◆ మూడ్రోజుల సమ్మెలో పెట్టిన కేసుల ఎత్తివేత

◆ ఆర్టీసీ సంఘాలకు సిఎం రేవంత్ హామీ

హైదరాబాద్,మే1 :
రాష్ట్రంలోని ఆర్టీసీ కార్మికులకు సీఎం రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. ఆర్టీసీ కార్మికుల 3 రోజుల సమ్మె కాలానికి వేతనాలు ఇవ్వాలని.. అలాగే, సమ్మె కాలంలో పెట్టిన కేసులు ఎత్తివేస్తామని తెలిపారు. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికుల 3 రోజుల సమ్మె కాలానికి వేతనాలు ఇవ్వాలని, సమ్మె కాలంలో పెట్టిన కేసులు ఎత్తివేయాలని కార్మిక సంఘాల ప్రతినిధులు సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కార్మిక సంఘాల నేతల అభ్యర్థనపై సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. సమ్మె కాలానికి 3 రోజుల వేతనం ఇచ్చేందుకు, కేసుల ఎత్తివేతకు అంగీకరించారు. ఈ మేరకు సమ్మె కాలంలో వేతనం, కేసుల ఎత్తివేతకు వెంటనే చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్, అధికారులను ఆదేశించారు. దీంతో తమ సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపించినందుకు సీఎంకి కార్మిక సంఘాల ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు. డిమాండ్ల పరిష్కారం కోసం ఇటీవల తెలంగాణ ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. మూడు రోజుల పాటు సమ్మె చేశారు. దీంతో రంగంలోకి దిగిన ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరిపింది. చర్చలు సఫలం కావడంతో ఆర్టీసీ కార్మికులు సమ్మె విరమించారు.

## స్కామ్ రోడ్ల టెండర్లలో గోల్‌మాల్

◆ ఎక్సెస్ టెండర్లతో దోచుకునే ప్లాన్

◆ టెండర్లను వెంటన రద్దు చేయాలన్న హరీష్

◆ రేవంత్ రాకతో మళ్లీ మంచినీటి కష్టాలు అంటూ ట్వీట్



హైదరాబాద్,మే1 :
కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పలు టెండర్లపై బీఆర్ఎస్ నేత మాజీ, ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్ర విమర్శలు చేశారు. గత అసెంబ్లీ సమావేశాల వేళ తాను ప్రస్తావించిన హ్యామ్ రోడ్ల స్కామ్ ఇప్పుడు నిజమైందని అన్నారు. పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ శాఖల్లో 22 నుంచి 25 శాతం వరకు ఎక్సెస్ టెండర్లు వచ్చాయని ఆరోపించారు. ఆర్ అండ్ బీ శాఖలో రూ.11 వేల కోట్ల టెండర్లకు దాదాపు రూ.15 వేల కోట్ల వరకు వ్యయం పెరిగిందని, పంచాయతీ రాజ్ శాఖలో రూ.6 వేల కోట్ల టెండర్లు రూ.8 వేల కోట్లకు చేరుతున్నాయని విమర్శించారు. ఈ రెండు శాఖల్లో కలిపి వేల కోట్ల రూపాయల అదనపు భారం రాష్ట్ర ప్రభుత్వ ఖజానాపై పడుతోందని హరీశ్ రావు పేర్కొన్నారు. జాతీయ రహదారుల టెండర్లు తగ్గింపుతో జరిగితే.. రాష్ట్ర రహదారుల టెండర్లు మాత్రం ఎక్సెస్‌కు వెళ్తున్నాయని మండిపడ్డారు. టెండర్లలో 40 శాతం రాష్ట్ర ఖజానా నుంచి వెళ్తే మిగిలిన 60 శాతం కాంట్రాక్టర్లు బ్యాంకు రుణాల ద్వారా సమకూర్చు కుంటారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ రుణాలను 15 సంవత్సరాల పాటు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. అయితే, కాంట్రాక్టర్లకు ప్రభుత్వం సావరిన్ గ్యారెంటీ ఇస్తోందని, దీని భారం చివరకు ప్రజలపైనే పడుతుందని మాజీ మంత్రి చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో 5 శాతం కంటే ఎక్కువ ఎక్సెస్ టెండర్లు లేవని హరీశ్ రావు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆర్ అండ్ బీ శాఖలో 34 ప్యాకేజీలు, పంచాయతీ రాజ్‌లో 17 ప్యాకేజీలుగా టెండర్లు పిలిచారని.. ఒకే కంపెనీకి 15 టెండర్లు దక్కబోతున్నాయని ఆరోపించారు. ఇక మొబిలైజేషన్ అడ్వాన్స్ అంశంపైనా ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రశ్నలు లేవనెత్తారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టుల సమయంలో మొబిలైజేషన్ అడ్వాన్స్‌లను వ్యతిరేకించిన రేవంత్ రెడ్డి ఇప్పుడు ఎలా సమర్థిస్తున్నారని ప్రశ్నించారు. ఈ టెండర్లను వెంటనే రద్దు చేసి మళ్లీ పిలవాలని, అలాగే మొబిలైజేషన్ అడ్వాన్స్‌లనూ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు రిటైర్ అయిన అధికారులకు ఎక్స్‌టెన్షన్‌లు ఇచ్చి తప్పుడు పనులు చేయిస్తున్నారని ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. దీనిపై పారదర్శకత అవసరమని, ప్రభుత్వం వెంటనే స్పందించి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మిగతాది 2లో



## కవిత భయంతో మేల్కొన్న కెసిఆర్

» కబ్జాలను తొలగిస్తున్న హైడ్రాపై అక్కసా

» పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

హైదరాబాద్,మే1 :
కవిత భయం వల్లే కేసీఆర్ బయటకు వస్తున్నారని పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ అన్నారు. ఈ మేరకు తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవితకు మహేశ్ గౌడ్ థాంక్స్ చెప్పారు. కవిత వల్లే మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

2 లో




## పదిరోజుల్లో శంర విలాస్ బ్రిడ్జి నిర్మాణం పనులు

. మే నెల చివరి నాటికి డ్రైన్ల నిర్మాణం పూర్తి

. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడి

గుంటూరు,మే1 :
గుంటూరు నగరంలోని శంకర్ విలాస్ సమీపంలో నిర్మిస్తున్న బ్రిడ్జి కోసం చేపట్టిన భూ సేకరణ జులై నాటికి పూర్తవుతుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు.

## కార్మికుల హక్కులు కాపాడుతున్నాం

» అన్ని రంగాల కార్మికులకు సర్కార్ అండ

» మేడు వేడుకల్లో కార్మిక మంత్రి వివేక్

» కార్మికులకు శ్రమశక్తి అవార్డుల బహుకరణ



హైదరాబాద్,మే1 :
కార్మికుల హక్కులు కాపాడేందుకు కృషి చేస్తున్నామని, కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి. అన్ని రంగాల కార్మికులకు అండగా ఉంటామన్నారు. మే డేను పురస్కరించుకుని హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించిన మేడే ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి.. కార్మికులకు శ్రమశక్తి అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ సూచనలతో గిగ్ వర్కర్లకకు భద్రత కల్పిస్తున్నామని అన్నారు. గిగ్ వర్కర్ల బిల్లుకు గవర్నర్ ఆమోదం తెలపడం మంచి పరిణామం అన్నారు. 4 లక్షల గిగ్ వర్కర్లకు మేలు జరగనున్నట్లు తెలిపారు.

2లో..

## టిఆర్ఎస్‌లో చేరనున్న బోడ జనార్ధన్

» పార్టీ అధ్యక్షురాలు కవితతో మాజీమంత్రి భేటీ



హైదరాబాద్,మే1
తెలంగాణ రాజకీయాల్లో సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి బోడ జనార్ధన్ టిఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించారు. త్వరలోనే తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీలో చేరబోతున్న ట్లు తెలిపారు. దీనికి సంబంధించి శుక్రవారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో గల పార్టీ కార్యాలయంలో టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతో ఆయన మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. త్వరలోనే తన అనుచరులతో కలిసి అధికారికంగా పార్టీ తీర్థం పుచ్చుకోనున్నట్లు బోడ జనార్ధన్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి బొగ్గు గనుల ప్రాంతంలో తెలంగాణ రక్షణ సేనను బలోపేతం చేయడానికి, పార్టీ విస్తరణకు తన వంతు కృషి చేస్తానని ప్రకటించారు. సీనియర్ నాయకుడైన ఆయన చేరికతో ఆ ప్రాంతంలో పార్టీకి కొత్త ఉత్సాహం రానుంది.



2లో..

## జూన్2 నాటికి జర్నలిస్ట్‌ల ఇళ్ల స్థలాల సమస్యకు పరిష్కారం

■ న్యాయపరమైన చిక్కుల్లేకుండా ఇళ్లస్థలాలు

■ ఎమ్మెల్యేలు, బ్యూరో క్రాట్స్‌తో పాటే అందరికీ స్థలాలు

■ ఫ్యూచర్‌సిటీలో ఇవ్వడానికి సిఎం రేవంత్ అంగీకారం

■ జర్నలిస్ట్ సంఘాలతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


హైదరాబాద్,మే1 :
అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిజాయితీ, చిత్తశుద్ధితో ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే పలు సందర్భాలలో ఇచ్చిన హామీల మేరకు అందరి అభిప్రాయాలను సేకరించి వచ్చేనెల 2వ తేదీనాటికి ఒక కొలిక్కి తీసుకువస్తామని వెల్లడించారు. శుక్రవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్, జర్నలిస్ట్స్ హౌసింగ్, డెక్కన్ జర్నలిస్ట్స్ , తెలంగాణ హౌసింగ్ సొసైటీలతో మంత్రి సమావేశం నిర్వహించారు.

## సేంద్రియ వ్యవసాయానికి పెద్దపీట

» పండించిన పంటల అమ్మకం కోసం యాప్

» 4న ప్రారంభించనున్న మంత్రి తుమ్మల

» నేగుగా సేంద్రియ ఉత్పత్తులు కొనుగోలుకు వీలు



మిగతాది 2లో

హైదరాబాద్,మే1 :
తెలంగాణ వ్యవసాయ రంగంలో మరో చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతం కాబోతోంది. సేంద్రీయ సాగు చేస్తున్న రైతులకు అండగా నిలిచేందుకు, వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. మే 4వ తేదీన సేంద్రీయ ఉత్పత్తుల క్రయ విక్రయాల కోసం రూపొందించిన ప్రత్యేక మొబైల్ యాప్ టిజి ఆర్గానిక్స్ ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించనున్నారు. రసాయన ఎరువులు, పురుగు మందులు, జన్యుమార్పిడి పంటలకు స్వస్తి పలికి.. సహజ వనరులు, సేంద్రీయ ఎరువులతో పంటలు పండించడమే సేంద్రీయ వ్యవసాయం.

## మెడికల్ సీట్ల పేరుతో నయా దందా

■ నీట్ పరీక్షతో...మోసగాళ్ల ఉచ్చులో పడకండి

■ పిల్లల తల్లిదండ్రులకు సిపి సజ్జన్నార్ హెచ్చరిక

హైదరాబాద్,మే1 :
నీట్ యూజీ పరీక్ష నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ కీలక సూచనలు చేశారు. వైద్య విద్యపై ఉన్న అపారమైన క్రేజ్‌ను పెట్టుబడిగా మార్చుకో వాలని కొందరు మోసగాళ్లు, దళారులు ప్రయత్నిస్తున్నారు.



మిగతాది 2లో

## పోలీస్‌శాఖలో అవినీతిని ఉపేక్షించం

» త్వరలో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరో

» 5 వేల ఖాళీల భర్తీకి ప్రభుత్వం సుముఖం

» డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మీడియాతో సీవీ ఆనంద్

02

హైదరాబాద్:
పోలీస్‌శాఖలో అవినీతి అతిపెద్ద సమస్యగా మారిందని.. దాన్ని ఉపేక్షించబోమని నూతన డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు.



# పోలీస్‌శాఖలో అవినీతిని ఉపేక్షించం

మొదటిపేజీ తరువాయి
తాను ఏసీబీలో పనిచేసినప్పుడు పోలీసుల్లో అవినీతిని గమనించానన్నారు. ఈ సమస్యపై త్వరలోనే సమీక్షించి అలాంటి అధికారులను ప్రత్యేకంగా పిలిచి మాట్లాడబోతున్నానని చెప్పారు. డీజీపీ కార్యాలయంలో శుక్రవారం శాంతిభద్రతల డీజీపీ మహేశ్‌భగవత్ నుంచి బ్యాటన్ అందుకొన్న అనంతరం కుటుంబసభ్యుల సమక్షంలో బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. పోలీస్‌శాఖ.. అధికారపక్షం, ప్రతిపక్షం అనే తేడా లేకుండా చట్టాల మేరకే నడుచుకుంటుందన్నారు. సామాజిక మాధ్యమాల్లో పోస్టులు శ్రుతిమించినప్పుడే పోలీసులు పిక్చర్‌లోకి వస్తారని స్పష్టం చేశారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేస్తామన్నారు. ఫోన్‌ట్యాపింగ్ కేసులో త్వరలోనే అనుబంధ అభియోగపత్రం దాఖలు చేస్తామని తెలిపారు. సమావేశంలో డీజీపీలు వి.వి.శ్రీనివాసరావు, స్వాతిలక్రా, సజ్జనర్, చారుసిన్హా, ఐజీపీలు ఎం.రమేశ్, షానవాజ్‌ఖాసిం, రమేశ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీవీఆనంద్ మాట్లాడారు.

### రాష్ట్రమంతటా ఏకరీతి పోలీసింగ్..

'సైబర్ నేరాల సమస్యపై ఇప్పటికే సైబర్ సెక్యూరిటీ బ్యూరో పనిచేస్తోంది. మ్యూల్‌ఖాతాలను పట్టుకోవడంతోపాటు పెద్దఎత్తున దర్యాప్తు చేస్తోంది. అయితే జిల్లాల్లో మాత్రం దర్యాప్తు కొరవడుతోంది. అందుకే జిల్లాల్లోనూ ఈ కేసుల్ని సులభంగా దర్యాప్తు చేసేందుకు ఏకరీతి పోలీసింగ్‌ను అమలు చేయబోతున్నాం. అలాగే మాదకద్రవ్యాల సమస్యను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటాం. మరోవైపు వ్యవస్థీకృత నేరంగా మారిన మానవ అక్రమరవాణా, ఆహారకల్తీ, జంతువుల స్మగ్లింగ్.. వంటి ముఠాలను గుర్తించి కఠినంగా వ్యవహరిస్తాం. రాజధానిలోని నాలుగు కమిషనరేట్ల పరిధిలో రోజుకు 1,600 కొత్త వాహనాలు రోడ్లపైకి వస్తున్నాయి. అందుకు అనుగుణంగా రహదారులను నిర్మించడం అంత సులువు కాదు కాబట్టి ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు తొలగించడంలాంటి రోడ్‌ఇంజినీరింగ్‌పై దృష్టి సారిస్తాం. దేశవ్యాప్తంగా ఏటా 1.72లక్షల మంది మరణిస్తే.. తెలంగాణలో 7 వేల మంది చనిపోతున్నారు. రోడ్డుభద్రత కోసం ఇప్పటికే అరైవ్-అలైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. అయితే హైదరాబాద్‌లో హెల్మెట్ నిబంధన అమలు చేస్తే రాష్ట్రమంతటా చేయడం లేదు. అందుకే రాష్ట్రమంతా ట్రాఫిక్ నిబంధనల్ని ఏకరీతిలో అమలు చేయబోతున్నాం. రోడ్డుభద్రతకు రాష్ట్రస్థాయిలో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరో ఏర్పాటు చేస్తాం.

### పోలీస్‌శాఖ పునర్వ్యవస్థీకరణ అవసరం

పోలీస్‌శాఖలో ఇప్పుడు 19వేల ఖాళీలున్నాయి. అయితే ఎప్పుడైనా పూర్తిస్థాయిలో రిక్రూట్‌మెంట్లు సాధ్యం కాదు. అందుకే పునర్వ్యవస్థీకరణ చేయబోతున్నాం. నక్సల్స్ సమస్య దాదాపుగా తీరిపోయిన నేపథ్యంలో అంతమంది సిబ్బందిని అక్కడ ఉంచడం సరికాదు. సిబ్బంది అవసరమైన విజిలెన్స్, ఏసీబీ, సీఐడీలాంటి విభాగాలకు సర్దుబాటు చేస్తాం. ప్రస్తుతం 5వేల ఖాళీల భర్తీకి ప్రభుత్వం సుముఖంగా ఉంది. పునర్వ్యవస్థీకరణ తర్వాత కచ్చితమైన ఖాళీల భర్తీకి ప్రభుత్వానికి నివేదిస్తాం. పోలీస్‌శాఖలో సత్సంప్రదాయాలు సన్నగిల్లుతున్నాయి. సమన్వయలోపాన్ని సరిచేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం' అని సీవీ ఆనంద్ చెప్పారు.

మీడియా అడిగిన ప్రశ్నలపై స్పందిస్తూ.. 2010లో మావోయిస్టుల సమస్యను అంతం చేస్తామని కేంద్రం చెప్పినప్పుడు తెలంగాణ పోలీసులుగా మేం నవ్వుకున్నామని పేర్కొన్నారు. కానీ ఇప్పుడు మావోయిస్టులు ఆయుధాలతోసహా లొంగిపోవడంతో నక్సలిజం పెరిగే అవకాశం చాలా తక్కువగా ఉందన్నారు. లొంగిపోయిన మావోయిస్టులపై తప్పనిసరిగా పోలీస్ పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 13లక్షల సీసీ కెమెరాల్లో ప్రస్తుతం 32శాతమే పనిచేస్తున్నాయన్నారు. రాబోయే రోజుల్లో కొత్తవి ఏర్పాటు చేయకున్నా.. ఉన్నవాటి మరమ్మతులకు ప్రాధాన్యమిస్తామని చెప్పారు. గోవధకు సంబంధించి ఫిర్యాదుల నమోదుకు టోల్‌ఫ్రీనంబర్ ఏర్పాటు చేస్తామన్నారు.

## నలుగురు ఫుడ్ సేఫ్టీ ఉద్యోగుల సస్పెండ్
### విధుల్లో నిర్లక్ష్యంపై కమిషనర్ ఉత్తర్వులు

రాజధాని అమరావతిలోని ఫుడ్ సేఫ్టీ ప్రధాన కార్యాలయంలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నలుగురు ఉద్యోగస్థులను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ సస్పెండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండ్యన్ ఆదేశాలు జారీ చేశారు. మంగళగిరిలోని ఆహార భద్రత శాఖ (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్) ప్రధాన కార్యాలయంలో సూపరింటెండెంట్ డి. శిరీష, సీనియర్ అసిస్టెంట్స్ జి. అఖిల్, సంగీత రావు, జె. సుజాత విధులు నిర్వహిస్తున్నారు. అయితే అనధికారికంగా సెలవుపై వెళ్లడం, విశ్రాంత ఉద్యోగికి ఆర్థిక ప్రయోజనాల చెల్లింపుల విషయంలో స్పందించకపోవడం తదితర కారణాలతో సుజాతను సస్పెన్షన్ చేశారు. అలాగే విధి నిర్వహణలో ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించకపోవడంతోపాటు పలుమార్లు హెచ్చరించినప్పటికీ మార్పు కనిపించక పోవడంతో మిగిలిన వారిని సస్పెన్షన్ చేశారు. ఈ మేరకు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.నలుగురు ఉద్యోగస్థులపై గతంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీనిపై మంత్రి విచారణకు ఆదేశించారు. విచారణ నివేదిక ఆధారంగా ఈ నలుగురిపై చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించింది. విధి నిర్వహణలో అలక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఉద్యోగస్థులను కమిషనర్ వీర పాండ్యన్ హెచ్చరించారు.

## కార్మికులకు అండగా కూటమి ప్రభుత్వం
### తమది కార్మిక పక్షపాత ప్రభుత్వం

టీడీపీ జెండాలోనే కార్మికుల కోసం చక్రం చిహ్నంగా ఉందని మంత్రి వాసంశెట్టి సుభాశ్ అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. 20 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉపాధి పొందుతున్నారని చెప్పారు. పమిడిముక్కల గ్రామంలో నిర్వహించిన ప్రజావేదిక సభలో మంత్రి మాట్లాడుతూ.. గత ఐదేళ్లు వైసీపీ పాలనలో జగన్ అనేక కంపెనీలను తరమికొట్టారని విమర్శించారు. భవన నిర్మాణ కార్మికులు ఊచకోతకు గురయ్యారన్నారు. గత ప్రభుత్వంలో కార్మికులు తిండి లేక పస్తులు ఉన్నారని.. వారి జీవితాలను చీకట్లోకి నెట్టారని వ్యాఖ్యానించారు. ఇప్పుడు ఏపీతో పాటు, ఇతర రాష్ట్రాల కార్మికులు రాష్ట్రంలో పనుల కోసం వస్తున్నారని మంత్రి వెల్లడించారు. ఇంటిగ్రేటెడ్ సెంటర్లుగా ఐదు నగరాలను ఎంపిక చేశామని.. వీటిని పదిహేను నగరాలకు విస్తరించాలని సీఎం చంద్రబాబు సూచించినట్లు తెలిపారు. కార్మికుల కోసం గుప్పెడు ఇసుక కూడా గత ప్రభుత్వం వేయలేదని మండిపడ్డారు. వారి సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా వారి నిధులు వాడేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో కార్మికుల కష్టాలు తీర్చి, భద్రత, భరోసా ఇచ్చామని వాసంశెట్టి సుభాశ్ తెలిపారు. మే డే సందర్భంగా కార్మికులకు పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా శుభాకాంక్షలు తెలిపారు. భారతదేశ చరిత్రలో పేదల ఇంటికి వచ్చి పెన్షన్ అందిస్తున్న ఏకైక సీఎం చంద్రబాబు నాయుడు అని అన్నారు. అమ్మో ఒకటో తేదీ వస్తుందా అనే స్థాయి నుంచి.. హమ్మయ్య ఒకటో తేదీ వస్తుంది అనేలా పేదల జీవితాల్లో పెన్షన్ ద్వారా ఆనందం నింపారని తెలిపారు. గత ఐదేళ్లుగా వైసీపీ ఉండగా.. వ్యవసాయం దండగ అనేలా చేశారని మండిపడ్డారు. నేడు చంద్రన్న ఉండగా చింతేల అని రైతులు గుండెల మీద చేయి వేసుకుని చెబుతున్నారన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో కూటమి ప్రభుత్వం డబ్బులు జమ చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. రైతుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం చేస్తే కూటమి విజయం చిరస్థాయిగా ఉంటుందన్నారు. అభివృద్ధి, సంక్షేమం, సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టి ముందుకెళ్తున్నామని తెలిపారు. పామర్రు నియోజకవర్గంలో ఉన్న ముఖ్య సమస్యలు పరిష్కరించాలని కోరారు. 24 గంటలూ ప్రజల కోసం, రాష్ట్రం కోసం ఆలోచన చేసే ఏకైక నేత చంద్రబాబు అని వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు.

## రైతు ఆత్మహత్యా యత్నం..అడ్డుకున్న పోలీసులు

ధాన్యం కొనుగోలులో జాప్యాన్ని నిరసిస్తూ రైతు డీజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం ఎల్లారెడ్డిపల్లెలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..నెల రోజులుగా కొనుగోలు కేంద్రాల వద్ద పడికాపు కాస్తున్నా ధాన్యం కొనడం లేదని ఆరోపిస్తూ ఎల్లారెడ్డి పల్లి సర్పంచ్ భర్త మఠంల శేఖర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.గమనించిన పోలీసులు అతడిని అడ్డుకున్నారు. కాగా, గ్రామ రైతులు రోడ్డుపై ధాన్యం పోసి నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతుల ఆందోళన భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

## నల్లగొండ ఫార్మికంపెనీలో పేలుడు

నల్లగొండ జిల్లాలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలి 9 మందికి తీవ్ర గాయాలయ్యాయి. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు శివారులో ఉన్న నోష్ ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలడంతో అగ్నిప్రమాదం జరిగింది. శుక్రవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. నోష్ ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలడంతో భారీ ఎత్తున తెల్లటి పొగ ఆకాశంలోకి ఎగసిపడుతోంది. దీంతో భయాందోళనకు గురయ్యారు స్థానికులు. ప్రమాదం జరిగిన సమయంలో 3వ బ్లాక్ లో ఉన్న 9 మందికి తీవ్ర గాయాలైనట్లు తెలుస్తోంది. గాయపడ్డవారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. దట్టమైన పొగ కమ్ముకోవడంతో సహాయక చర్యలకు ఇబ్బందిగా మారింది. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై స్పందించిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. తరచు ప్రమాదాలు జరిగుతున్న కంపెనీని సీజ్ చేసి...

### మెడికల్ సీట్ల పేరుతో
## నయా దందా

మొదటిపేజీ తరువాయి
తల్లిదండ్రులు ప్రత్యేక జాగ్రత్త వహించాలని సోషల్ మీడియా ఎక్స్ వేదికగా సీపీ విన్నవించారు. 'మీ పిల్లలను డాక్టర్లుగా చూడాలనే ఆశతో మోసగాళ్ల మాయమాటల ఉచ్చులో పడకండి' సీపీ సజ్జనార్ విన్నవించారు.'మీ పిల్లలు నీట్‌లో తక్కువ మార్కులు సాధించినా, మేనేజ్‌మెంట్ కోటాలో చాలా తక్కువ ధరకే ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తామని లేదా ఫిలిప్పీన్స్, కిర్గిజ్‌స్థాన్, కజకిస్థాన్, జార్జియా, చైనా, అర్మేనియా, కరేబియన్ దేశాల్లో అతి తక్కువ ఖర్చుతో వైద్య విద్య పూర్తి చేయవచ్చని ఆకర్షణీయంగా చెప్పి మోసం చేసే ఏజెంట్ల మాటలు నమ్మవద్దు' అని హెచ్చరించారు.గతంలో హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఇలాంటి ముఠాలు అనేక మంది తల్లిదండ్రులను మోసం చేశాయని సీపీ గుర్తుచేశారు. ఎందరో తల్లిదండ్రులు కష్టపడి సంపాదించిన డబ్బును కోల్పోగా, విద్యార్థులు విలువైన సంవత్సరాన్ని కోల్పోయిన సంఘటనలు అనేకం ఉన్నాయన్నారు. విదేశీ వైద్య కళాశాలలో అడ్మిషన్ తీసుకోవాలనుకుంటే.. ఆ కాలేజీకి భారత ప్రభుత్వం నేషనల్ మెడికల్ కమిషన్ గుర్తింపు ఉందో లేదో అధికారిక వెబ్‌సైట్‌లో తప్పకుండా పరిశీలించాలని.. లేదా స్వయంగా అధికారులను సంప్రదించి నిర్ధారించుకోవాలని సూచించారు. అడ్మిషన్ల పేరుతో దళారుల చేతికి నగదు రూపంలో లక్షల రూపాయలు ఇవ్వొద్దని సజ్జనార్ తెలిపారు. ఏ ఫీజులు చెల్లించాల్సి వచ్చినా నేరుగా సంబంధిత యూనివర్సిటీ, కాలేజీ బ్యాంక్ ఖాతాకే చెల్లించాలన్నారు. విద్యార్థులు ఎంతో కష్టపడి సాధించిన ఫలితాలను, భవిష్యత్తు కలలను ఈ నకిలీ ఏజెంట్ల చేతుల్లో పెట్టి ఆందోళనకు గురికావద్దని సూచించారు. ఎంబీబీఎస్ సీట్ల పేరుతో ఎవరైనా సంప్రదించినా, డబ్బుల కోసం వేధిస్తున్నా వెంటనే డయల్ 100కి సమాచారం ఇవ్వాలని.. సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని అన్నారు.

## కవిత భయంతో మేల్కొన్న కెసిఆర్

మొదటిపేజీ తరువాయి
మేల్కొంటున్నారని వ్యాఖ్యానించారు. హైడ్రా గురించి కేసీఆర్ చదువుకుంటే మంచిదని హితవుపలికారు. కబ్జాల నుంచి విముక్తి కల్పిస్తే కేసీఆర్‌కు వచ్చిన ఇబ్బంది ఏంటి అని ప్రశ్నించారు. హైడ్రా వల్ల బీఆర్ఎస్ నాయకులకు ఇబ్బంది కలుగుతోందన్నారు. సిటీ చుట్టూ ఉన్న చెరువులను ఆ పార్టీ నేతలే కబ్జా చేశారని ఆరోపించారు. గులాబీ పార్టీ నేతలు ఎందుకు సభలు పెడుతున్నారని పీసీసీ చీఫ్ నిలదీశారు. తాము చేసిన డిక్లరేషన్లు అమలు చేస్తున్నామని.. త్వరలోనే పదవుల భర్తీ ఉంటుందని స్పష్టం చేశారు. నాలుగు రోజుల క్రితం పదవుల భర్తీపై చర్చించినట్లు తెలిపారు. మంత్రివర్గ విస్తరణపై సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకుంటారని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## పదిరోజుల్లో శంర విలాస్ బ్రిడ్జి నిర్మాణం పనులు

మొదటిపేజీ తరువాయి
మరో పదిరోజుల్లో ఈ బ్రిడ్జి నిర్మాణం పనులు వేగవంతం అవుతాయని చెప్పారు. ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేజ్ -3 పనులు వేగవంతం చేయాలని ఇప్పటికే అధికారులను ఆదేశించామన్నారు. శుక్రవారం గుంటూరులో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఉన్నతాధికారులతో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సమీక్ష నిర్వహించారు. నార్ల వెంకటేశ్వర రావు ఆడిటోరియం అభివృద్ధికి బిడ్డింగ్ పూర్తయిందన్నారు. వేసవిలో ప్రజల కోసం చలివేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.కొత్తగా 220 ఈ ఆటోలు గుంటూరు నగర పాలక సంస్థకి రానున్నాయని వివరించారు. దీని ద్వారా నగరంలో చెత్త సేకరణ మరింత సులువు అవుతుందని తెలిపారు. మే నెల చివరి నాటికి నగరంలో డ్రైన్ల నిర్మాణం పూర్తి అవుతుందని చెప్పారు. గరంలో 22 పార్కుల అభివృద్ధికి రూ.7.2 కోట్లు కేటాయించినట్లు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వివరించారు. పార్కుల్లో పిల్లలకు ఆట వస్తువులతోపాటు జిమ్ పరికరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. నగరంలో వీధి కుక్కల సమస్య అధికంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నెలకు 125 వీధి కుక్కలకు ఆపరేషన్ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి తెలిపారు.

## స్కామ్ రోడ్ల టెండర్లలో గోల్‌మాల్

మొదటిపేజీ తరువాయి
రాష్టంలో తాగునీటి కష్టాలను రేవంత్ రెడ్డి తిరిగి తెచ్చారని హరీష్‌రావు ఆరోపించారు. మార్పు రావాలంటూ ప్రజలను మోసం చేసి నీటి కష్టాలను తీసుకొచ్చిన ముఖ్యమంత్రికి ప్రజలపై ప్రేమ లేదని ట్విటర్ వేదికలో విమర్శించారు. పల్లె నుంచి పట్నం దాకా తాగు నీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పథకాలు ఉన్నాయి. ఫలితం లేదు. పైపులు ఉన్నాయి నీళ్లు రావని విమర్శించారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న కేసీఆర్ మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి నల్లాలు ఏర్పాటు చేసి తాగు నీరు సరఫరా చేశారని గుర్తు చేశారు. రేవంత్ కనీసం ఆ పథకాన్ని కొనసాగించలేక పోతున్నాడని పేర్కొన్నారు. మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో ఎక్కడ చూసినా మళ్లీ ట్యాంకర్లు, బిందెలు, డ్రమ్ములు దర్శనం ఇస్తున్నాయని వెల్లడించారు. దేశానికే ఆదర్శంగా నిలిచిన మిషన్ భగీరథ పథకాన్ని కేసీఆర్‌పై కోపంతో నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. నోటి నుండి అబద్దాల ప్రవాహాన్ని పారించడం మానేసి, మిషన్ భగీరథ పైపుల్లో నీళ్లు పారించాలని, ప్రజల కన్నీటి బాధలు తీర్చాలని డిమాండ్ చేశారు.

### కార్మికుల హక్కులు
## కాపాడుతున్నాం

మొదటిపేజీ తరువాయి
కార్మికుల విషయంలో యాజమాన్యాల దృక్పథం మారుతుందన్నారు. కార్మికుల భద్రత కోసం యాజమాన్యాలు మరింత కృషి చేయాలని సూచించారు. వ్యవసాయ రంగంలో కార్మికులకు మెళకువలు నేర్పిస్తామని తెలిపారు. యువతకు స్కిల్స్ పెంచి.. ఉపాధి కల్పించేందుకు ఏటీసీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వివేక్ తెలిపారు. టాటా కంపెనీతో ఒప్పందం చేసుకుని ఏటీసీ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 120 ఏటీసిల్లో రూ.4 వేల కోట్లతో ట్రైనింగ్ ఇస్తున్నట్లు చెప్పారు. ఏటీసీ సెంటర్లలో స్టూడెంట్స్ కు రూ.2500 స్కాలర్ షిప్స్ ఇస్తున్నామన్నారు. అగ్రికల్చర్ రంగాన్ని కూడా కోర్సుల్లో చేర్చినట్లు చెప్పారు. విదేశాల్లో ఉద్యోగ అవకాశాల కోసం టామ్ కామ్ కు సీఎం రేవంత్ 90 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. యువతకు జర్మన్ భాష నేర్పిస్తున్నట్లు చెప్పారు. యువతలో స్కి÷-ల్స్ పెంచేందుకు ఏటీసీ సెంటర్ల ఏర్పాటు కార్మిక రంగంలో ఉన్నవారికి ఈఎస్ఐ సదుపాయం కల్పించే ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. శంషాబాద్, రామగుండంలో 100 బెడ్స్ హాస్పిటల్స్, మహబూబ్ నగర్ లో 30 బెడ్స్ హాస్పిటల్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్మికుల కోసం పీజేఆర్ పేరుతో లైఫ్ టైం అచీవ్?మెంట్ అవార్డు వచ్చే ఏడాది నుంచి ప్రకటిస్తామని తెలిపారు. కార్మికుల పక్షాన పీజేఆర్ నిలబడ్డారని గుర్తు చేశారు. కార్మికుల కోసం మల్టీస్పెషలిటీ హాస్పిటల్ పెట్టాలని డిమాండ్ వస్తోందని.. ఆ దిశగా కూడా ఆలోచన చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. సింగరేణి కార్మికుల పెన్షన్ పెంచాలని.. పెన్షన్ పెరిగేవరకు పోరాడతానని అన్నారు వంశీకృష్ణ. కాకా స్ఫూర్తితో కార్మికుల కోసం పోరాటం చేస్తానని అన్నారు. గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం మంత్రి వివేక్ పోరాడారని..4 లక్షల మంది గిగ్ వర్కర్లకు మేలు జరగనుందని అన్నారు. పెద్దపల్లి జిల్లా ప్రజలు ఆశీర్వదించి తనను పార్లమెంట్ కు పంపించారని అన్నారు. కార్మికులకు దివంగత కాకా సేవలు చిరస్మరణీయమని.. సింగరేణి కార్మికులను కాకా ఆదుకున్నారని అన్నారు. కార్మికులకు పెన్షన్ సౌకర్యం తీసుకొచ్చిందే కాకా అని అన్నారు. రాష్ట్రంలో 65 ఎటిసి సెంటర్లు ఏర్పాటు చేసుకున్నామని... ఈ సెంటర్ల ద్వారా యువత స్కిల్ పెరుగుతుందని అన్నారు. మే డే వేడుకల్లో ఎమ్మెల్యే గడ్డం వినోద్, లేబర్ కమిషనర్ సత్పతి పమేల, ఎంప్లాయ్మెంట్ అండ్ ట్రైనింగ్ కమిషనర్ దాసరి హరిచందన, లేబర్ అడిషనల్ కమిషనర్ గంగాధర్, కార్పొరేటర్ విజయరెడ్డి , రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### టిఆర్ఎస్‌లో చేరనున్న
## బోడ జనార్ధన్

మొదటిపేజీ తరువాయి
బోడ జనార్దన్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చెరగని ముద్ర వేశారు. ప్రస్తుతం మంచిర్యాల జిల్లాలో ఉన్న చెన్నూరు శాసనసభ నియోజకవర్గం నుండి తెలుగుదేశం పార్టీ తరపున వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది తన సత్తా చాటారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు హయాంలో ఆయన కార్మిక శాఖ మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. అనుభవజ్ఞుడైన నాయకుడు పార్టీలో చేరుతుండటంపై టీఆర్ఎస్ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

### జూన్2 నాటికి జర్నలిస్టుల ఇళ్ల
## స్థలాల సమస్యకు పరిష్కారం

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్ కేంద్రంగా ఉన్న జర్నలిస్టు హౌసింగ్ సొసైటీలు ఎప్పుడు ఏర్పాటయ్యాయి, అందులో సభ్యుల సంఖ్య, సభ్యత్వానికి అర్హతలు, ఇతర అన్ని అంశాలపై మంత్రిగారు సొసైటీ సభ్యులు అడిగి తెలుసు కున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీ మినహా మిగిలిన మూడు సొసైటీలలో సుమారు 2,424 మంది అర్హులైన జర్నలిస్టులు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జర్నలిస్టులు అందరూ ఒకేతాటిపై ఉంటే సమస్యల పరిష్కారం సులువు అవుతుందని, అన్ని సొసైటీలు కలిపి ఒకే వేదికపైకి వచ్చి జేఏసీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జర్నలిస్టు సంఘాలలో సభ్యులు కాని అర్హులైన జర్నలిస్టులకు కూడా ఇళ్ళ స్థలాలు ఇస్తామని చెబుతూ ఎలాంటి విమర్శలకు, అనుమానాల కు తావు లేకుండా ఇళ్ల స్థలాల మంజూరు జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. గతంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలదేనని, ఇప్పుడు కూడా ప్రజా ప్రభుత్వం వచ్చాక 18 ఏళ్లుగా పరిష్కారం కాని జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ఇళ్ల సమస్యను కొలిక్కి తీసుకువచ్చి రవీంద్ర భారతిలో జర్నలిస్టుల కుటుంబాలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి భూమి అప్పగించినప్పటికీ న్యాయవివాదాల కారణంగా సమస్య మళ్లీ మొదటికి వచ్చిందని గుర్తు చేశారు. జర్నలిస్ట్ ల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకొని జూన్ 2వ తేదీ నాటికి కొలిక్కి తీసుకువస్తామని తెలిపారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూల దృక్పథంతో ఉన్నారని ఫ్యూచర్ సిటీలో ఎమ్మెల్యేలు, బ్యూరో క్రాట్స్ తో పాటే హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్టులకు కూడా ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వారికి సూచన ప్రాయంగా వెల్లడించి సొసైటీలో ఒక తీర్మానం చేసి ప్రభుత్వానికి అందజేయాలని సూచించారు. 18 సంవత్సరాల క్రితమే ఇంటి స్థలాల కోసం ప్రతిసభ్యుడు రెండు లక్షల రూపాయిల చొప్పున చెల్లించారని దీనిని దృష్టిలో పెట్టుకొని ఇళ్ల స్థలాల కేటాయింపులో తమ సొసైటీకి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా సభ్యులు మంత్రిని కోరారు. సమావేశంలో మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి, సమాచార పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ జి. ముకుంద రెడ్డి, సిపీఆర్వో మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రియ వ్యవసాయానికి పెద్దపీట

మొదటిపేజీ తరువాయి
నేటి ఆధునిక కాలంలో అధిక దిగుబడుల కోసం రసాయనాలను విచ్చలవిడిగా వాడుతున్నారు. దీనివల్ల రైతులకు పెట్టుబడి ఖర్చులు పెరగడమే కాకుండా, మనం తినే ఆహారం విషతుల్యమవుతోంది. వాతావరణం కూడా దెబ్బతింటోంది. ఈ పరిస్థితుల్లో ప్రపంచవ్యాప్తంగా సేంద్రీయ ఉత్పత్తులకు గిరాకీ పెరిగింది. చాలామంది రైతులు ఆసక్తితో సేంద్రీయ సాగు వైపు మొగ్గుచూపుతున్నప్పటికీ.. మార్కెట్‌లో సరైన గుర్తింపు, నాణ్యతా ప్రమాణాలు లేకపోవడం వల్ల వినియోగదారుల్లో నమ్మకం కలగడం లేదు. ఈ సమస్యను అధిగమించేందుకే ప్రభుత్వం యాప్‌ను తీసుకువస్తోంది. దీని ద్వారా రైతులు పండించిన పంటకు సరైన ధర, వినియోగదారులకు కల్తీలేని ఆహారం లభించనున్నాయి. తెలంగాణ సేంద్రీయ సాగులో ఈ యాప్ ఒక నూతన విప్లవానికి నాంది కానుంది. ప్రస్తుతం దాదాపు 500 మంది రైతులు యాప్ లో ఉన్నారు. తెలంగాణలో సేంద్రీయ ధృవీకరణ సేవలు ఇస్తున్న ఇతర రీజినల్ కౌన్సిల్స్ అయిన ఏకలవ్య ఫౌండేషన్, సెంటర్ ఫర్ సస్టైయినబుల్ అగ్రికల్చర్ తో ఇతర ఆర్గానిక్ రైతుల వివారాలు కూడా ఈ యాప్ లో పొందుపరచడం జరుగుతుంది. సుమారు 100 కు పైగా ఆర్గానిక్ ప్రొడక్ట్స్ ఈ యాప్ లో కస్టమర్లకు అందుబాటులో ఉంచడం జరిగింది .రైతు మొబైల్ నంబర్, చిరునామా, లొకేషన్ వివరాలు పొందవచ్చు .రైతు వద్ద అందుబాటులో ఉన్న ధృవీకృంచిన వివిధ ఆర్గానిక్ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయి. తెలంగాణ రాష్ట్ర విత్తన / సేంద్రీయ ధృవీకరణ అథారిటీ ద్వారా సేంద్రీయ ధృవీకరణ సర్టికెట్లు పొందిన రైతుల వివరాలు మాత్రమే యాప్ లో ఉంటాయి . ఈ యాప్ ద్వారా కేవలం ఆర్గానిక్ రైతు వివరాలు, మరియు అతన వద్ద అందుబాటులో ఉండే ప్రొడక్ట్స్ వివరాలు మాత్రం ఈ యాప్ లో ఉంచడం జరిగింది. ఆర్గానిక్ ప్రొడక్ట్స్ రేటు ను నిర్ణయించే అధికారం రైతుకు మాత్రమే ఉంటుంది. కావునా రైతును నేరుగా సంప్రదించి ధర విషయాలు చర్చించుకోవచ్చు.

# కేరళ కౌంటింగ్‌లో కమలం వికసిస్తుందా?

## ఎల్.డి.ఎఫ్ మరియు యు.డి.ఎఫ్ మధ్యన ఎన్.డి.ఏ ఉనికిని చాటుకుంటుందా

**శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్**

విశ్లేషకుల అంచనాల ప్రకారం, కేరళ రాష్ట్ర రాజకీయాల్లో సంప్రదాయబద్ధంగా వస్తున్న LDF మరియు UDF కూటముల మధ్యే ప్రధాన పోటీ నెలకొంది.

**» భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్ డి ఏ (NDA) తన ప్రభావాన్ని పెంచుకోవడానికి ప్రయత్నించినప్పటికీ, సీట్ల పరంగా అది ఇప్పటికీ నామమాత్రపు పాత్రకే పరిమితమయ్యే అవకాశం ఉందని విశ్లేషణలు సూచిస్తున్నాయి**

**» కేరళ రాజకీయ ముఖచిత్రంలో ఎన్ డి ఏ ప్రస్తుత పరిస్థితిపై సమగ్ర విశ్లేషణ చూద్దాం**

**» ఎన్.డి.ఏ అంచనాలు మరియు సీట్ల గణాంకాలు**

వివిధ సంస్థల ఎగ్జిట్ పోల్స్ ప్రకారం ఎన్ డి ఏ కేవలం 0 నుండి 7 సీట్ల మధ్య మాత్రమే గెలుచుకునే అవకాశం ఉంది.

**» టుడేస్ చాణక్య**

ఎన్ డి ఏకు 3 నుండి 7 సీట్లు రావచ్చని అంచనా వేసింది, ఇది ఇతర సంస్థల కంటే కాస్త సానుకూలమైన అంచనా ఇది.

**» యాక్సిస్ మై ఇండియా**

ఈ కూటమికి 0 నుండి 3 సీట్లు మాత్రమే దక్కుతాయని పేర్కొంది.

**» మాట్రిజ్ మరియు సిఎన్ఎన్-18**

బిజెపి 0 నుండి 5 సీట్లు మధ్యన వస్తాయని అంచనా వేశాయి.




**» బీజేపీ వ్యూహాలు మరియు ఆశలు**
**నియోజకవర్గాల ఎంపిక బీజేపీ ఈసారి తిరువనంతపురం, పాలక్కాడ్ మరియు త్రిసూర్ బెల్ట్‌లోని కొన్ని కీలక స్థానాలపై ప్రత్యేక దృష్టి సారించింది**

**» ఓట్ల శాతం పెరుగుదల**

సీట్లు రాకపోయినా, గత కొన్ని ఎన్నికల నుండి బీజేపీ తన ఓట్ల శాతాన్ని క్రమంగా పెంచుకుంటూ వస్తోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో త్రిసూర్‌లో విజయం సాధించడం పార్టీకి కొత్త ఆశలను చిగురింపజేసింది.

**» కమ్యూనిటీ ఓటింగ్**

ఎజావ (Ezhava) మరియు క్రైస్తవ వర్గాల్లోని కొంత భాగాన్ని ఆకట్టుకోవడానికి బీజేపీ చేసిన ప్రయత్నాలు ఈ ఎన్నికల్లో ఎలాంటి ఫలితాలిస్తాయనేది ఆసక్తికరంగా మారింది.

**» బిజెపి ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లు**

ద్విముఖ పోటీగా ఉన్న కేరళలో ఎల్డిఎఫ్ మరియు యుడిఎఫ్ ల మధ్య ఉన్న బలమైన వ్యవస్థను ఛేదించి మూడవ శక్తిగా ఎదగడం బీజేపీకి అతిపెద్ద సవాలుగా మారింది

**» మైనార్టీల ప్రాబల్యం**

రాష్ట్ర జనాభాలో సుమారు 45% ఉన్న ముస్లిం మరియు క్రైస్తవ ఓటర్లు సంప్రదాయబద్ధంగా కాంగ్రెస్ లేదా లెఫ్ట్ కూటములకే మొగ్గు చూపుతున్నారు.
మిగిలిన జనాభాలో ఉన్న హిందువులు అటు కమ్యూనిస్ట్ పార్టీ లేదా కాంగ్రెస్ పార్టీ వైపు ఉన్నారు.
కేరళలో బిజెపికి కాలు పెట్టడానికి కూడా అవకాశం లేదు విచిత్ర రాజకీయ పరిస్థితి ఉంది. ఇటువంటి సవాళ్లు ఎదుర్కొంటూ బిజెపి కేరళలో మెల్లమెల్లగా తన ఉనికిని స్థాపించుకుంటూ వస్తున్నది.

**» అభ్యర్థుల ఎంపిక**

క్షేత్రస్థాయిలో పట్టున్న నేతల కంటే సోషల్ మీడియాలో గుర్తింపు ఉన్న లేదా కొత్త ముఖాలను దింపడం వల్ల కొన్ని చోట్ల ఆశించిన ఫలితాలు రాకపోవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.
మొత్తానికి, కేరళలో అధికారం యుడిఎఫ్ దక్కించుకుంటుందని మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ చెబుతుండగా.. ఎన్ డి ఏ తన ఉనికిని చాటుకోవడానికి మరియు కనీసం ఐదు లోపు సీట్లను గెలుచుకోవడానికి గట్టి ప్రయత్నం చేస్తోంది.

**» మే 4న వెలువడే ఫలితాలు కేరళలో "కమలం" ఎంతవరకు వికసించిందో స్పష్టం చేస్తాయ్యి**

**» ప్రస్తుత సమాచారం ప్రకారం, కేరళలో భారతీయ జనతా పార్టీ (BJP) పరిస్థితి**

**» పెరుగుతున్న ఓట్ల శాతం**

గత కొన్ని ఎన్నికలుగా కేరళలో బీజేపీ ఓట్ల శాతం క్రమంగా పెరుగుతోంది. ప్రధానంగా హిందూ ఓటర్లను ఆకర్షించడం ద్వారా పార్టీ తన బలాన్ని పెంచుకుంటోంది.

**» తొలి లోక్‌సభ విజయం**

**» 2024 లోక్‌సభ ఎన్నికల్లో త్రిశూర్ నియోజకవర్గం నుండి సురేష్ గోపి విజయం సాధించడం పార్టీ చరిత్రలో ఒక ముఖ్యమైన మలుపుగా నిలిచింది. కేరళ నుండి ఎన్నికైన మొదటి బీజేపీ ఎంపీ ఈయనే**

**» అసెంబ్లీలో ప్రస్తుత పరిస్థితి**

2016లో నెమోమ్ నియోజకవర్గం ద్వారా కేరళ అసెంబ్లీలో తొలి సీటు గెలుచుకున్నప్పటికీ, 2021 ఎన్నికల్లో ఆ సీటును కోల్పోయింది.

**» ప్రస్తుతం కేరళ అసెంబ్లీలో బీజేపీకి ప్రాతినిధ్యం లేదు**

**» 2026 అసెంబ్లీ ఎన్నికల వ్యూహం**

2026లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గణనీయమైన ప్రభావం చూపాలని భావించింది.

**» పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న రాజీవ్ చంద్రశేఖర్ నేతృత్వంలో కొన్ని ఎంపిక చేసిన నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి సారించింది**

**» ప్రధాన పోటీ**

కేరళలో సంప్రదాయబద్ధంగా సాగే ఎల్‌డీఎఫ్ (LDF) మరియు యూడీఎఫ్ (UDF) కూటముల మధ్య పోరులో బీజేపీ ఇప్పుడు ఒక బలమైన మూడవ శక్తిగా ఎదిగేందుకు ప్రయత్నిస్తోంది.

**» ఇతర పార్టీల నుండి చేరికలు**

ఇటీవల కాంగ్రెస్ మరియు వామపక్ష పార్టీల నుండి కొందరు నేతలు బీజేపీలో చేరడం పార్టీకి కొంత ఊపునిచ్చింది.
మొత్తానికి, సీట్లు గెలవడంలో సవాళ్లు ఎదుర్కొంటున్నప్పటికీ, కేరళ రాజకీయాల్లో బీజేపీ ప్రభావం మునుపటి కంటే పెరిగిందని విశ్లేషణలు చెప్తున్నాయి.

**» కేరళలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో బిజెపి గెలవబోయే సీట్ల సంఖ్య ఇదమిద్దంగా ఉన్నప్పటికీ.. బిజెపి ఈసారి తన ఓట్ల శాతాన్ని ఘననీయంగా పెంచుకుంటుందని పరిశీలకులు చెబుతున్నారు**

## సిరికొండలో హిందూ మహా సమ్మేళనం

**» హిందువులు సంఘటితం కావాలని పిలుపు**

**కరపత్రం ప్రతినిధి కోరుట్ల**



జగిత్యాల జిల్లా, కోరుట్ల మండలం సిరికొండ గ్రామంలో శుక్రవారం హిందూ మహా సమ్మేళనం జరిగింది. హిందూ ధర్మ పరిరక్షణకు, హిందువులంతా సంఘటితం కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. హిందూ జీవన విధానాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని విశ్వాత్మానందగిరి కోరారు. ఈ కార్యక్రమంలో ఏలికట్టే మహేందర్, దొప్పల షాలిని, ముదాం రవీందర్, మధుసూదన్, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## న్యాయవాదులతో కలిసి కేసుల పరిష్కారానికి కృషి

**» మెట్టుపల్లి జూనియర్ సివిల్ జడ్జి వి.మాధవి**

**గాజంగి మహేశ్వర్, కరపత్రం మెట్టుపల్లి**




జగిత్యాల జిల్లా మెట్ పల్లిలో శుక్రవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పరిచయ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి వి. మాధవి పాల్గొన్నారు. కేసుల పరిష్కారంలో పరస్పర సహకారంతో ముందుకు వెళ్దామని, బార్ అండ్ బెంచ్ రిలేషన్ షిప్ పెంచుకోవడానికి తనవంతు సహకారం ఉంటుందని ఆమె తెలిపారు. పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం కోసం న్యాయవాదులు సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్, సీనియర్ న్యాయవాదులు శ్రీ జిల్లా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

**» ఐలాపూర్ జెడ్. పి హై స్కూల్ ఘనత**

**కరపత్రం ప్రతినిధి, కోరుట్ల**




జగిత్యాల జిల్లా, కోరుట్లలోని అయిలాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శుక్రవారం ఘనంగా సత్కరించారు. 1వ ర్యాంక్ సాధించిన హారిక అంకం, 2వ ర్యాంక్ పొందిన విహాన్, 3వ ర్యాంక్ సాధించిన పాశం రాగవీనలను శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దావనపెల్లి రామకృష్ణ, ఉపసర్పంచ్ వనపర్తి సౌమ్య, అడ్వకేట్ క్రాంతి కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ నర్సింహా మూర్తి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కుషాయిగూడలో 54 అడుగుల హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన



**» భక్తుల జయజయధ్వానాలు**



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

హైదరాబాద్‌లోని కుషాయిగూడ బస్టాండ్ వద్ద 54 అడుగుల భారీ హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం అంగరంగ వైభవంగా శుక్రవారం జరిగింది. భక్తుల బజరంగబలి నినాదాలతో ఆ ప్రాంతం మారుమోగింది. ఈ సందర్భంగా సీతారామస్వామి కళ్యాణాన్ని కూడా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హంపి విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామి, యోగానంద సరస్వతీ స్వామి, త్రిదండి చిన జీయర్ స్వామి, చిట్టిపెద్ది రామశర్మ, బ్రహ్మశ్రీ ఆర్.శివ కార్తీక్ శాస్త్రి పాల్గొన్నారు. ఉప్పల్, మేడ్చల్ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

## టిడ్కో గృహాల పూర్తి పై ప్రత్యేక దృష్టి

**- జూన్ నాటికి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయండి..**
**- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.**

జిల్లాలో నిర్మాణంలో ఉన్న టిడ్కో గృహాల పనులను వేగవంతం చేసి, జూన్ నెలాఖరు నాటికి పూర్తి చేసి లబ్దిదారులకు గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో టిడ్కో గృహాల నిర్మాణ పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పేదలకు సొంతింటి కలను నెరవేర్చడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. జిల్లాలో టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు మరింత వేగవంతం చేయాలన్నారు. లబ్దిదారులకు సౌకర్యవంతమైన నివాస వాతావరణం కల్పించేందుకు అవసరమైన అన్ని మౌలిక వసతులను సమకూర్చడంపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. జిల్లాలో టిడ్కో గృహ నిర్మాణ ప్రాజెక్టుల పనుల పై దృష్టి పెట్టి నిర్మాణ పనులు ఎక్కడైనా నిలిచిపోయినట్లయితే వెంటనే సమస్యలను గుర్తించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 11,520 టిడ్కో గృహాలను త్వరలో పూర్తి చేయాలన్నారు. జక్కంపూడిలో 6576 గృహాలకు గాను 2,256 టిడ్కో ఇళ్లు అందించడం జరిగిందని మరో 4,320 ఇళ్లు లబ్దిదారులకు అందించాల్సిన ఉందన్నారు. ఇందులో జూన్ నాటికి కనీసం 3 వేల గృహాలు లబ్దిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే జగ్గయపేటలో 2000 తిరువూరులో 672 గృహాలు జూన్ నాటికి అందించాల్సిన భాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. గృహాల నిర్మాణ నాణ్యతపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని, పనులు ప్రమాణాలకు అనుగుణంగా జరగాలని తెలిపారు. లబ్దిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమగ్ర ప్రణాళికతో పనులు పూర్తి చేయాలని సూచించారు. జక్కంపూడి టిడ్కో గృహాల కోర్టు కేసులను వారం రోజులలో పూర్తి చేసి పనుల అనుమతి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని విజయవాడ రూరల్ తహాశీల్దార్‌ని ఆదేశించారు.

## సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా మేడే ఉత్సవాలు



**కరుణాకర్ మల్లి గారి, కరపత్రం ప్రతినిధి**

బోడుప్పల్ సర్కిల్ 11వ డివిజన్ ఇందిరా నగర్ కాలనీలో సీపీఐ పార్టీ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు ఘనంగా జరిగాయి. సీనియర్ నాయకులు విబి బాలరాజ్, దండ రమేష్ లు సీపీఐ, ఏఐటీయూసీ జండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచ్చ కిషన్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం మే 1న ప్రపంచవ్యాప్తంగా కార్మికులు అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని జరుపుకుంటారని తెలిపారు.

## మైనర్ కూతురిపై లైంగిక దాడి కేసు

**» తండ్రికి 62 ఏళ్ల జైలు శిక్ష**

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**



మైనర్ కూతురిపై లైంగిక దాడికి పాల్పడిన తండ్రికి పోక్సో ఫాస్ట్ ట్రాక్ కోర్టు న్యాయమూర్తి వెంకటేశ్ శుక్రవారం సంచలన తీర్పు వెలువరించారు.్లనిందితుడికి మొత్తం 62 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ. 35 వేల జరిమానా విధించారు

**» బాధితురాలికి జిల్లా న్యాయ సేవా సంస్థ ద్వారా రూ. 3 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించారు**

## మెట్టుపల్లి లో మేడే వేడుకలు కార్మికుల భారీ ర్యాలీ



**గాజంగి మహేశ్వర్, కరపత్రం మెట్టుపల్లి**

జగిత్యాల జిల్లా మెట్పల్లి పట్టణంలో 141వ మేడే ఉత్సవాలు ఘనంగా జరిగాయి. వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కూన గోవర్ధన్, ఏఐటిసి నాయకులు ముఖ్య అతిథులుగా హాజరై జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం కార్మికులందరూ వ్యవసాయ మార్కెట్ నుండి మెట్పల్లి బస్టాండ్ మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు.

## ఓసిపి వన్ బేస్ వర్క్ షాప్ లో మేడే వేడుకలు



కరపత్రం ప్రతినిధి గోదావరిఖని మే 01:
ఓసిపి వన్ బేస్ వర్క్ షాప్, ఎస్ ఎన్ డి సెక్షన్ల యందు గల మ్యాన్ వే వద్ద 140 వ నేడే సందర్భంగా ప్రపంచ కార్మికులారా ఏకంకండి అనే నినాదంతో మ్యాన్ వే వద్ద జెండా ఆవిష్కరణ చేశారు. జెండా ఆవిష్కరణ బేస్ వర్క్ షాప్ ఇంచార్జ్ నాన్ ఆపరేషన్ అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ అనుమట్ల శ్రీను జండా ఆవిష్కరించారు. దీనికిగాను ముఖ్య అతిథిగా డిప్యూటీ జనరల్ సెక్రటరీ వైవి రావు, ప్రభాకర్ గౌడ్ హాజరయ్యారు. వైవి రావు మాట్లాడుతూ 1886లో చికాగో నగరంలో జరిగిన అమరవీరుల, ఆరోజు జరిగిన కాల్పుల్లో వీర మరణము పొందిన అమరవీరుల త్యాగమే ఈ మేడే ఎర్రజెండా అని కొనియాడారు. బేస్ వర్క్ షాప్ 100 టన్ను నుండి కే.తిరుపతి, టైర్ సెక్షన్ నుండి సుధాకర్, ఎండి పాష, రాకేష్, లింగయ్య, ఓరుగంటి శ్రీను, ఆనంద్, రవి, లింగయ్య, డోజర్ సెక్షన్ నుండి ఇంచార్జ్ రాజు, ఎస్ఎన్డి సెక్షన్ ఇంచార్జ్ బి.రాజ కొమురయ్య, అర్జయ, సదయ్య, భాస్కర్, చంద్రశేఖర్, ఐఎన్టియుసి నుండి శ్రీనివాసరావు, కుమార్, సమ్మయ్య ఫోర్ మెన్, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు. సిఐటియు నుండి అరవింద్, డి.ప్రవీణ్, టీబీజీకేఎస్ నుండి పూర్ణాకర్ హాజరై అన్ని యూనియన్లు కలిసి మేడే జెండాను ఆవిష్కరించారు.

## మృతుని కుంటుంబానికి ఆర్థిక సహాయం

కరపత్రం ప్రతినిధి గోదావరిఖని మే 01:
గోదావరిఖని సంజయ్ నగర్ కు చెందిన కండె రామస్వామి ఇటీవల ప్రమాదంలో కాలు కోల్పోగా చికిత్స పొందుతూ రెండు రోజుల క్రితం మరణించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి స్పందించారు. పార్టీ నాయకులను మృతుడు రామస్వామి



ఇంటికి శుక్రవారం పంపించారు. కుటుంబానికి బాసటగా రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నియోజకవర్గ పరిధిలో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో సేవా కార్యక్రమాలు చేస్తూ తనకంటూ ప్రత్యేకతను చాటుకున్నారు. ఇదే క్రమంలో పార్టీ శ్రేణులతో పాటు సామాన్య ప్రజలకు ఎక్కడ ఇబ్బందులు ఉన్న నేనున్నానంటూ ఆపన్న హస్తం అందిస్తున్నాడు. కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబ సభ్యులను కలిసి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఓదార్చారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఏరియా ఉపాధ్యక్షుడు వడ్డేపల్లి శంకర్, పార్టీ నాయకులు జాహిద్ పాషా, కోదండ రామాలయం ఆటో యూనియన్ అధ్యక్షుడు బొట్ల శ్రీనివాస్, రామగుండం కార్పొరేషన్ ఆటో యూనియన్ మాజీ అధ్యక్షులు ఈర్ల ఐలయ్య, బీఆర్ఎస్ నాయకులు పల్లె సురేందర్ తదితరులు ఉన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో జరుగుతున్న రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో పాల్గొన్నా డాక్టర్ లక్ష్మణ్ రావు డాక్టర్ నీనా

కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట మే 1





ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వావిద్యాలం ఆధ్వర్యంలో జరుగుతున్న "రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమలో భాగంగా వ్యవసాయ ఇంజినిరింగ్ కళాశాల కంది మండలం సంగారెడ్డి బోధన సిబంది శు క్రవారం నాడు డాక్టర్ లక్ష్మణరావు డాక్టర్ నీనా మెదక్ జిల్లా మాసాయిపేట మండలంలోని పోతిన్ శెట్టిపల్లి గ్రామంలో అన్నదాతలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారుఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మణ్ రావు మాట్లాడుతు, పంటలలో యూరియా వినియోగం తగ్గించడం, రసాయన ఎరువుల వినియోగం తగ్గించి జీవ ఎరువులు వాడడం సేంద్రియ పద్ధత్తులపై వివరించడం జరిగిందని. డాక్టర్ నీమా మాట్లాడుతూ పంట మార్పిడి వల్ల జరిగే మేలు, నీటి ఆదా చేయడం మార్కెట్లో గిరాకీ ఉన్న వరి పంటలపై చర్చించడం జరిగిందని. ఉద్యాన విస్తరణ అధికారి గోవిందా కూరగాయల పండ్ల తోటల పెంపకం గురించి అవగాహన కల్పించడం జరిగిందని ఆయిల్ ఫామ్ పంట పెంపకం పాటించవలసిన జాగ్రత్తలు సబ్సిడీ గురించి వివరించడం జరిగిని.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉప్పల ప్రశాంత్ , ఉప సర్పంచ్, గ్రామపంచాయతీవార్డులు రైతులు, హెచ్ ఈ ఓ గోవింద్ , ఆయిల్ ఫామ్ ఫీల్డ్ ఆఫీసర్ ఉదయ్ కుమార్ , ఏ ఈ ఓ రజిత, పంచాయతీ సెక్రెటరీ ప్రమోదిని తదితరులు పాల్గొన్నారు

## టీజీయూఈయూ-సీఐటీయూ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

కరపత్రం ప్రతినిధి రాజన్న సిరిసిల్ల



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సర్కిల్ ఆఫీస్ ఆవరణలో టీజీయూఈయూ-సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సిరిసిల్ల టీఎస్ ఎన్పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాధవ్ శు క్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలకు చల్లని తాగునీరు అందించేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో యూనియన్లు చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలువాల స్వామి, జిల్లా అధ్యక్షులు కర్నాల అనిల్ కుమార్ ముదిరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి నర్ర శ్రీనివాస్ రెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర మల్లేశం, ట్రెజరర్ సాసాల రాంబాబు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ అనిల్ గౌడ్, పిట్టల మల్లేష్, కిషన్, అంజిరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం

- తక్షణమే మద్దతు ధరతో కొనుగోళ్లు జరపాలి
- రైతు ప్రజాసంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు



కరపత్రం ప్రతినిధి కరీంనగర్:
ఆరుగాలం కష్టపడి పంటలు పండించిన రైతులకు దాన్యపు విక్రయించుకునే సమయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయ సహకారాలు అందడం లేదని, కొనుగోలు కేంద్రాలకు కుప్పలు తెప్పలుగా దాన్యం వస్తున్నా ఇంకా ఎందుకు కొనుగోళ్లు మొదలు పెట్టడం లేదని రైతులను ఆదుకోవడంలో సర్కార్ పూర్తిగా విఫలమైందని రైతు ప్రజా సంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు ఆరోపించారు. శుక్రవారం రైతు ప్రజా సంఘాల ఐకాస రాష్ట్ర, జిల్లాల నాయకుల తో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో పోలాడి రామారావు మాట్లాడుతూ.. దాన్యపు కొనుగోలు కేంద్రాలను ఆర్భాటంగా ప్రారంబించి 10 రోజులు దాతుతున్నా, కొనుగోళ్లు మాత్రం జరపడం లేదన్నారు. దీంతో అకాల వర్షాల నేపథ్యంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కనీసం వారికి టార్పాలీన్ షీట్ కవర్లు,గన్నీ బ్యాగులు సరఫరా చేయడం లేదని దీంతో ప్రైవేట్ దళారులకు రైతులు తక్కువ ధరకు దాన్యాన్ని అమ్ముకోవాల్సిన దుస్థితి దాపురించిందని ఇందుకు ప్రభుత్వ పెద్దలు ప్రైవేట్ వ్యక్తుల మధ్య కుదిరిన బేర సారాల లోపాయికారీ ఒప్పందమేనని ఆరోపణలు వస్తున్నాయని అన్నారు. కొన్ని కొనొగోలు కేంద్రాల కొద్ది మొత్తం కొనుగోళ్లలో క్వింటాల్ కు తాలు మట్టి లేని, ఆరబెట్టి ఎండిన సూకా దాన్యానికి తూకం సమయంలో ఐదు కిలోల దాన్యాన్ని అదనంగా తీసుకుంటున్నారని, మిల్లుల దగ్గర కూడా బస్తాకు కిలో, రెండు కిలోల తీస్తూ రైతులను నిలువునా దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హమాలీలు లేరని మిల్లుల వారు తీసుకోవడం లేదని సాకులు చెబుతూ ఇప్పటికే 60 శాతం దాన్యం ప్రైవేట్ వ్యక్తుల పాలు చేశారన్నారు.సన్న రకాలకు ఇస్తున్న 500 రూపాయల బోనస్ ఎగొట్టేందుకే ప్రభుత్వం ఇలాంటి ఎత్తుగడలు వేస్తోందని రామారావు విమర్శించారు. కావాలనే ప్రైవేట్ వాళ్లకు లబ్ది చేసేందుకే ఆలస్యంగా దాన్యపు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి దాన్యపు కొనుగోళ్లు జరపడం లేదన్నారు.దీంతో రైతులు నిలువు దోపిడీకి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ఇప్పటికే రెండు సార్లు రైతు భరోసా నిధులను ఎగొట్టిన ప్రభుత్వం,సాగు సమయంలో ఇవ్వాల్సిన రైతు భరోసా నిధులను ఇప్పుడు పంటల కోత సమయంలో అర కొరగా విడతల వారీగా ఇవ్వడం హాస్యాస్పదమన్నారు. సన్న వడ్లకు క్వింటాల్ కు రూ. 500 బోనస్ ను వెంటనే దాన్యపు డబ్బుల తో పాటే ఇవ్వాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఎలాంటి తరుగు లేకుండా మద్దతు ధరతో తక్షణమే దాన్యపు కొనుగోళ్లను జరపాలని పోలాడి రామారావు డిమాండ్ చేశారు. పొద్దు తిరుగుడు, శనగ, మొక్క జొన్న రైతులు కూడా పడి కాపులు కాస్తున్నారని వారి దాన్యాన్ని తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతో క్కనుగోళ్లు జరపాలని లేకుంటే రైతు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అలుపెరుగని పోరాటం చేస్తామని పోలాడి పేర్కొన్నారు. రైతుల పంటలు, వరి కోతలు పూర్తి కాక పోవడం తో రైతులుకు రావడం ఇబ్బంది అవుతుందని భావించి వివిధ వర్గాలు విద్యార్థుల విన్నపం మేరకు రైతు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కరీంనగర్ లో రైతుల మహాగర్జన సమర భేరి సభను మే 30 వ తేదీకి మార్చినట్లు పోలాడి రామారావు తెలిపారు. మే 30 న రెండు లక్షల మంది తో రైతుల మహాగర్జన సభను పార్టీల కతీతంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రైతు ప్రజా సంఘాల రాష్ట్ర జిల్లాల నాయకులు జున్నుతుల రాజిరెడ్డి,ఏనుగు చొక్కారెడ్డి, విక్రమ సింహారావు. నగునూరి రాజేందర్,తీగల లక్ష్మణ్ రావు, కోడూరు సత్యనారాయణ, బోయినపల్లి శ్రీనివాస్ రావు, వెంకటేశ్వర్ రావు, దాట్ల మెహన్, కొత్త కొండరవీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# చికాగో అమరవీరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మించాలి: సిపిఎం నేత చెల్పూరి రాము



కరపత్రం ప్రతినిధి ఇల్లంతకుంట, మే 1
ఇల్లంతకుంట మండల కేంద్రంలో మే డే సందర్భంగా సిపిఎం ఆధ్వర్యంలో ఘనంగా ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి చెల్పూరి రాము మాట్లాడుతూ, అమెరికాలోని చికాగో నగరంలో సుమారు 140 సంవత్సరాల క్రితం కార్మికుల హక్కుల కోసం జరిగిన పోరాటం ప్రపంచ కార్మిక ఉద్యమానికి మార్గదర్శకమైందన్నారు. 8 గంటల పని విధానం అమలు చేయాలని శాంతియుతంగా పోరాడుతున్న కార్మికులపై పోలీసులు కాల్పులు జరపడం వల్ల ఆరుగురు కార్మికులు అమరులయ్యారని గుర్తుచేశారు. వారి త్యాగ స్ఫూర్తితోనే మే డే ఉత్సవాలు జరుపుకుంటున్నామని తెలిపారు.
అదే స్ఫూర్తితో ప్రస్తుత కాలంలో కూడా కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలు చేపట్టి బలమైన ప్రజా ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం నయా ఉదారవాద విధానాలతో కార్మికుల హక్కులను హరించేస్తోందని, 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం ద్వారా కార్మికులకు అన్యాయం జరుగుతోందని విమర్శించారు. ఈ లేబర్ కోడ్‌లు కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉండి, కార్మికుల శ్రమ దోపిడీకి దారి తీస్తున్నాయని ఆరోపించారు.దేశంలోని కార్మికులందరికీ సమాన వేతనాలు అమలు చేయాలని, ప్రస్తుత ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందని, కార్మిక చట్టాలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దేశవ్యాప్తంగా కార్మికులకు పనిపై చట్టబద్ధ హక్కులు లేవని, వాటిని కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని పేర్కొన్నారు.ప్రతి రంగంలో కార్మికులే నష్టపోతున్నారని, అందరూ ఏకమై తమ హక్కుల సాధన కోసం మే డే స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వంతడుపుల, మల్యాల, శ్రీరాములపల్లి, సీతంపేట, సిరిసేడు, ఇల్లంతకుంట గ్రామాల్లో సిఐటియు జెండా ఆవిష్కరణలు నిర్వహించారు. కార్యక్రమంలో కొత్తూరు మల్లయ్య, తిప్పరపోయిన శ్రీకాంత్, జముఖం వెంకన్న, గురుకుల కట్ట స్వామి, రావుల ఎల్లయ్య, సారయ్య, శ్రీనివాస్, తిరుపతి, రమేష్, శీను, సంపత్, లక్ష్మయ్య, కొమరయ్య, రవీందర్, అశోక్, ఐలయ్య, జంపయ్య, రాజు, అనిల్, మొగిలి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# నేత్రదానం మహాదానం -- పూదరి ఈశ్వరమ్మ చూపు ఇద్దరికీ వెలుగై నిలిచింది





కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, మే 1
కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని శివాలయం వీధికి చెందిన కీర్తిశేషులు పూదరి ఈశ్వరమ్మ (80) గారు శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు వృద్ధాప్యంతో మృతి చెందారు. మరణానంతరం ఆమె నేత్రాలను దానం చేయడంతో ఇద్దరు అంధులకు చూపు లభించేలా కుటుంబ సభ్యులు ఆదర్శంగా నిలిచారు.
మద్దెర్ల సారంగపాణి సమాచారంతో సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు మచ్చగిరి నరహరి, డీలర్ గర్రెపల్లి వెంకటేశ్వర్లు నేత్రదానంపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. వారి సమ్మతితో నరహరి ఆధ్వర్యంలో కరీంనగర్ వాసన్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ చందు సహకారంతో నేత్రాలను సేకరించి హైదరాబాద్ వాసన్ ఐ బ్యాంక్‌కు తరలించారు.ఈ మహత్తర దానంతో ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించిన ఈశ్వరమ్మ గారి కుమారులు-కోడళ్లు రాజు-లక్ష్మి, సంపత్-రజిత, కూతురు-అల్లుడు హేమలత-శ్యాంసుందర్‌లను పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో సహకరించిన గర్రెపల్లి వెంకటేశ్వర్లు, చిట్టి కేసి శివానందయ్య, ముత్యాల జగదీశ్వర్, చిదురాల శ్రీనివాస్, మద్దెర్ల సారంగపాణి తదితరులకు సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, జాతీయ కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి, జిల్లా అధ్యక్షుడు మచ్చగిరి నరహరి, ముఖ్య సలహాదారులు నూక రమేష్, గౌరవ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ప్రచార కార్యదర్శి వాసు, లగిశెట్టి చంద్రమౌళి మరియు బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

# జోగిపేటలో మేడే ఉత్సవాలు



కరపత్రం ప్రతినిధి అందోలు
కార్మికుల హక్కులను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కాలరాస్తుందని అందోల్ డివిజన్ సిఐటియు కార్యదర్శి డి. విద్యాసాగర్ అన్నారు. శుక్రవారం మే డే సందర్భంగా జోగిపేట పట్టణంలో కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. డివిజన్ పరిధిలోని ఆయా గ్రామాలతో పాటు అందోల్ జోగిపేట మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ఆయా కార్మిక సంఘాల వద్ద సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 గంటలకు బదులు 12 గంటలు పని విధానాన్ని తీసుకువస్తూ కార్మికుల హక్కులను హరించి వేస్తుందన్నారు.ఏ ఇప్పటికే దీనికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా పలు చోట్ల కార్మికులు తిరుగుబాటు చేస్తున్నారు. 8 గంటల పని విధానం అమలు చేయాలనీ ఆయన డిమాండ్ చేశారు.. పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలనీ, నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పోరేట్లకు వరాలు ఇస్తూ పేదలపై భారాలు వేస్తుందన్నారు. విద్యా, వైద్యం కార్పోరేట్ల చేతిలోకి వెళ్లిపోయిందన్నారు. రాబోవు రోజుల్లో కార్మికుల హక్కుల సాధనకు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎర్రోళ్ల మహేష్, మండల నాయకులు రాములు, ప్రభాకర్, శివకుమార్, పెంటయ్య, నరేందర్, సురేష్, మల్లేశం, శ్రావణ్, హరి ప్రసాద్, భీమ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.